నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 24 నవంబర్ 2024 | RANGAREDDY


కులకచర్ల రైతు వేదికలో జరిగిన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కరెంట్ లేక సెల్‌ఫోన్ల లైట్ వెలుతురులో ఉన్న లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు


బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం షాబాద్ మాజీ జడ్పీటీసీ, యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించారు. -షాబాద్, నవంబర్ 23

## సెల్‌ఫోన్ వెలుతురులో చెక్కుల పంపిణీ

**మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వేదిక వద్ద లబ్ధిదారుల నిరీక్షణ**

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోసం పడిగాపులు**

**ఎట్టకేలకు రాత్రి 7.48 గంటలకు హాజరు..**

**బ్యాటరీలు, సెల్‌ఫోన్ల వెలుతురులో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

కులకచర్ల, నవంబర్ 23 : రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పవర్‌లోకి వచ్చిన 11 నెలల కాలంలోనే విద్యుత్తు సరఫరా సక్రమంగా లేకపోవడంతో అన్నదాతలు.. పింఛన్లు రాక వృద్ధులు, దివ్యాంగులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కాక విద్యార్థులు.. ఇలా జనం బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కాగా మండలంలోని రైతువేదిక భవనంలో శని వారం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చీకట్లో జరిగింది. చెక్కులను తీసుకునేందుకు లబ్ధిదారులు మధ్యాహ్నం రెండు గంటల సమయంలోనే వేదిక వద్దకు వచ్చారు. అప్పటి నుంచి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోసం నిరీక్షించారు. ఇది గో ఎమ్మెల్యే వస్తున్నారు.. అదిగో వస్తున్నారని అధికారులు చెప్పడంతో అక్కడే చీకట్లో కూర్చుని పడిగాపులు కాశారు. సహనం కోల్పోయిన కొంతమంది లబ్ధిదారు లు ఎమ్మెల్యే ఇంకా ఎప్పుడు వస్తారని ప్రశ్నించారు. మధ్యాహ్నం అని చెప్పి రాత్రి వరకు కూర్చోబెట్టడం సరికాదని ..రాత్రివేళ తమ గ్రామాలు, తండాలకు ఎలా వెళ్లాలని అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాత్రి 7:48 గంటలకు అక్కడికి రాగా.. తమకే ముందుగా చెక్కులను పంపిణీ చేయాలని పలు గ్రామాల లబ్ధిదారులు కోరడంతో అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను బ్యాటరీలు, సెల్‌ఫోన్ల లైట్ల వెలుతురులో లబ్ధిదారులకు పంపిణీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తండాలకెళ్లే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు అవమానం


చెక్కుల పంపిణీలో స్టేజీపై కుర్చీలేకపోవడంతో నిలబడే ఉన్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందర్‌నాయక్ (సర్కిల్‌లో)

**చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించని అధికారులు**

**ప్రోగ్రాం పూర్తయ్యేవరకు కుర్చీ లేకపోవడంతో నిలబడే ఉన్న మూడవత్ చందర్‌నాయక్**

**గిరిజన నాయకుడైనందునే అలా వ్యవహరించారని వెల్లడి..**

బషీరాబాద్, నవంబర్ 23 : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో అధికారులు ప్రొటోకాల్ పాటించ లేదు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మూడావత్ చందర్‌నాయక్‌కు కుర్చీ కేటాయించకుండా అవమానపర్చారు. దీంతో అతడు కార్యక్రమం పూర్తి అయ్యేవరకు స్టేజీపై నిలబడే ఉన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలోనే అధికారులు ఇలా వ్యవహరిస్తే, సాధారణ సమావేశంలో ఎలా గౌరవిస్తారని.. గిరిజన నాయకుడైనందుకే ఇలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ, పీఏసీ ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు మాధవ్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, అజయ్‌ప్రసాద్, మూడావత్ చందర్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, పవన్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

## సినీనటుడు అలీ నిర్మాణాలకు నోటీసులు


నోటీసులు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి శోభారాణి

నవాబుపేట, నవంబర్ 23 : సినీ నటుడు మహ్మద్ అలీ అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. మండలంలోని ఎక్‌మామిడి గ్రామ పంచాయతీ రెవెన్యూలో అలీకి భూమి, ఫామ్‌హౌస్ ఉన్నది. దానిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఏక్‌మామిడి గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి నోటీసులు అందజేశారు. ఆ నోటీసులో పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుం డానే నిర్మాణాలు చేపడుతున్నారని రాశారు. అక్రమ నిర్మాణాలకు ఈ నెల 5న ఒక నోటీసు ఇవ్వగా, ఈ నెల 22న మరో నోటీసు అందజేశారు. ఆ ఫామ్‌హౌస్‌లో పని చేసే వారికి నోటీసులు అందించామని ఆమె చెప్పారు.

**ఈ నెల 11న తండాల్లో ప్రభుత్వం దాష్టీకానికి పాల్పడింది..**

**పోలీసులు దొరికిన వారిని దొరికినట్లు వ్యాన్లలో కుక్కారు**


**మహిళలపై దురుసుగా ప్రవర్తించారు..**

**జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు కండ్లకు కట్టినట్లు వివరించిన ఫార్మా భూ బాధిత కుటుంబాలు**

**బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం**

**న్యాయం చేయాలని వినతి**

**భూములిచ్చే ప్రసక్తే లేదని వెల్లడి**


రోటిబండతండాలో బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులు

# మా ఆవేశాన్ని రాజకీయం చేశారు..

### అధికారులను కావాలని అడ్డుకోకున్నా.. దానిని దాడిగా చిత్రీకరించారు

*మా ఆవేశాన్ని కొంతమంది రాజకీయం చేశారని.. మేము అధికారులను కావాలని అడ్డుకోకున్నా.. దానికి రాజకీయ రంగు పులిమారారని ఫార్మా భూబాధిత కుటుం బాలు కన్నీటి పర్యంతమయ్యాయి. తమపై ఈ నెల 11న అర్ధరాత్రి సమయంలో ప్రభుత్వం దాష్టీకానికి పాల్పడిందని భోరున విలపించారు. వందలాదిగా వచ్చిన పోలీసులు కరెంట్ సరఫరా తీసేసి.. ఇల్లిల్లూ జల్లెడ పట్టి.. దొరికిన వారిని దొరికినట్లు వ్యాన్లలో కుక్కారని.. మహిళలపై దురుసుగా ప్రవర్తించారని.. వృద్ధులు, చిన్నారులు అని కూడా చూడకుండా వారిపై దాడి చేశారని.. అమయకులనూ అక్రమంగా అరెస్టు చేశారని ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు వివరించారు. గత 12 రోజులుగా భయం.. భయంగా..బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని.. ఎప్పుడు ఎవరు వస్తారో.. మళ్లీ ఏం జరుగుతుందోనని తిండి, నిద్రా లేకుండా ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని జీవిస్తున్నామన్నారు. తమకు న్యాయం చేసి, ఇతర ప్రాంతాలకెళ్లిన రైతులు, కుమారులను ఇండ్లకు రప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రాణాలు పోయినా తమ భూములను ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.*

*-కొడంగల్, నవంబర్ 23*

**కన్నీటిపర్యంతమైన ఫార్మా భూ బాధిత కుటుంబ సభ్యులు**

లగచర్ల ఘటనపై శనివారం జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విచారించారు. ఫార్మా బాధిత రైతులు ఢిల్లీకెళ్లి తమకు న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా.. కమిషన్ సూచనల మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ లా ముకేశ్, ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌సింగ్, యతీప్రకాశ్‌శర్మ బాధిత గ్రామాలను సందర్శించి.. రైతు కుటుంబాలను కలిసి వివరాలు సేకరించారు. ఈ నెల 11న జరిగిన ఘటన, అనంతరం జరిగిన పరిణామాలు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఒక్కొక్కరిని అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు భూములిచ్చే ప్రసక్తి లేదని వారు స్పష్టం చేశారు. మాకు భూమే ఆధారమని అది లేకుండా మా బతుకులు శూన్యమన్నారు. పంటల సాగు కోసం బ్యాంకుల్లో అప్పుల కోసం వెళ్తే అక్కడి అధికారులు మీకు రుణాలు ఇవ్వబోమని.. మీ భూములు ఫార్మావిలేజ్ ఏర్పాటులో పోతున్నాయని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు అయిన రైతులు, యువకులను విడిపించాలని, మా భూములను కాపాడాలని కమిషన్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. కాగా అధికారులకు ఎదురు తిరిగిన వారిలో కొందరు పరారీలో ఉన్నారని.. వారందరూ వచ్చి పోలీసుల ఎదుట, కోర్టుల్లో లొంగిపోతే బెయిల్ వచ్చే అవకాశం ఉంటుందని పోలీసులు తండాల్లోని మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, డీటీడబ్ల్యూ కమలాకర్‌రెడ్డి, దుద్యాల తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.


ఘటన రోజు జరిగిన వీడియోను పరిశీలిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్‌స్పెక్టర్

## సీఎం గారూ.. మైనార్టీ డిక్లరేషన్ ఏమైంది..?

### రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి కన్వీనర్ అబ్దుల్ వాహబ్



కొడంగల్, నవంబర్ 23 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మైనారిటీ డిక్లరేషన్ హామీ ఏమైందని రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి కన్వీనర్ అబ్దుల్ వాహబ్ సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. శనివారం ఆయన వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే మైనారిటీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించారని.. పవర్‌లోకి వచ్చి 11 నెలలు దాటినా దాని ఊసేత్తడం లేదని ఆరోపించారు. మైనారిటీలను కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకులా మాత్రమే వాడుకుంటున్నదని మండిపడ్డారు. ప్రధానిని బడేభాయ్ అంటూ రేవంత్‌రెడ్డి మోదీ అడుగుజాడల్లోనే నడుస్తున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మొదటి దశలోనే కేబినెట్‌లో మైనారిటీలకు అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. మైనార్టీ డిక్లరేషన్, మైనార్టీలకు ఇచ్చిన 22 హామీల్లో ఏ ఒక్కటి కూడా రేవంత్‌రెడ్డి అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించుకొంటూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. మైనార్టీ డిక్లరేషన్ హామీ అమలు చేయకపోతే నిరసనలు చేపట్టేందుకు మైనార్టీలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మైనార్టీ డిక్లరేషన్ అమలుకు గాను మైనార్టీలంతా ఏకతాటిపైకి రావాల్సిన సమయం వచ్చిందని, కాంగ్రెస్ మోసాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు.

## రెండు రోజుల్లో నీటి సౌకర్యం కల్పిస్తా..

### విద్యార్థినులకు హామీ ఇచ్చిన రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి


బొంగుళూరు మోడల్ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి నారాయణరెడ్డి

**బొంగుళూరు ప్రభుత్వ మోడల్ పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్**


ఆదిబట్ల, నవంబర్ 23 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు ప్రభుత్వ మోడల్ బాలికల పాఠశాలను శనివారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నదని విద్యార్థినులు కలెక్టర్‌కు తెలుపగా, రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. హాస్టల్ వంటగది, స్టోర్ రూంలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్‌లోని సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో వెంటనే రిపేర్ చేయించాలని అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ ప్రతి ఒక్కరికీ పునాది వంటిదని, బాగా చదువుకుని అనుకున్న లక్ష్యం చేరుకోవాలన్నారు. సోషల్ మీడియా, సినిమాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీసిన అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డి, ఆర్ఐ కృష్ణ తదితరులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ

**నాణ్యతగా లేకుంటే ఏజెన్సీలపై చర్యలు**

**వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

దౌల్తాబాద్, నవంబర్ 23 : మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని వికారా బాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని మాటూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా లేకుంటే ఏజెన్సీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బడి సరిపడా వసతులు ఉన్నాయా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డి, హెచ్ఎం భీమేశ్, పంచాయతీ కార్యదర్శి మల్లప్ప, ఉపాధ్యాయులు అశోక్, వెంకటేశ్ తదితరులున్నారు.


మాటూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్